క్లుప్తంగా

పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి, గోరంట్ల గ్రామాల్లో సాగు చేసిన పత్తి, ఆముదం, కంది పంటలను శుక్రవారం ఏఓ రవిప్రకాష్ పరిశీలించారు. పత్తి పంటకు ఇప్పుడే పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదని, ఒకవేల సన్న దోమ, పురుగు కనిపిస్తే వేపనూనె లేదా అస్ఫేట్ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆముదంలో అక్కడక్కడ పచ్చపురుగు కనపడుతున్నందున అస్ఫేట్ 500గ్రాములు, ఫినాల్‌ఫాస్ 500ఎంఎల్ ఎకరాకు బంకమందు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

డ్రోన్ సాంకేతికతపై విద్యార్థులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట సమీపానున్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రోన్ సాంకేతికతపై శిక్షణ ఇచ్చారు. ఇండియా డ్రోన్ అకాడమీ డైరెక్టర్ వంశీక్రిష్ణ, శిక్షకులు సుజల్‌క్రిష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డ్రోన్‌ను వైద్య, మిలటరీ, వ్యవసాయ రంగాల్లో ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థులు డ్రోన్‌లో సాంకేతిక నైపుణ్యం సాధిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎలక్ట్రానిక్ హెచ్‌ఓడీ మల్లికార్జున సూచించారు. కార్యక్రమంలో ప్రొగ్రామ్‌కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



బ్యాగ్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామన్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రథమ, ద్వితీయ విద్యార్థులు మొత్తం 280మందికి అందజేశామని ప్రిన్సిపాల్ రామన్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

పాణ్యం: పాణ్యం సబ్‌స్టేషన్లో ఫోల్ టూ ఫోల్ ఉద్యోగిగా పని చేస్తున్న శ్రీనివాసులు ఇటీవల షాట్‌షర్క్యూట్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం 1104యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 1.4 లక్షలు అందించారు. ప్రస్తుతం నంద్యాలలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులును మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబానికి అండగ ఉంటామని యూనియన్ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్



విద్యార్థులకు వాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం సచివాలయం–4 పరిధిలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు టీడీ వాక్సిన్ వేశారు. విద్యార్థులకు ధనుర్వాతం, సెప్టిక్ కాకుండా టీడీ వ్యాక్సిన్ వేస్తున్నామని మద్దూర్ పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్ తెలిపారు. 10 నుంచి 16సంవత్సరాలు వయసు విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఆయన సూచించారు.

ఇన్‌చార్జ్ కమిషనర్‌కు పూర్తి బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న పి.వి.రామలింగేశ్వర్‌కు పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్.ఎ.సీ) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21వ తేదీన నగరపాలక కమిషనర్‌గా పనిచేస్తున్న భార్గవ్‌తేజ గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న రామలింగేశ్వర్‌కు పరిపాలన ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి బాధ్యతలు అప్పగించారు.

అప్రమత్తతే శరణ్యం ?

- పారిశుద్ధ్యం అస్తవ్యస్తం... కంపుకొడుతున్న కాలనీలు
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- వణికిస్తున్న టైఫాయిడ్

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లోనూ పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గత వారం కిందట ఆరురోజులపాటు కురిసిన వర్షాలకు వీధులు, రహదారులు బురదమయం అయ్యాయి. మండలంలో 12 పంచాయతీలతోపాటు ఐదు మజరాలు గ్రామాలు ఉన్నాయి. ఎక్కువ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో దోమలు ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి మండల కేంద్రం గడివేములతో బిల్కలగూడూరు, పెసరవాయి, కరిమద్దిల, చిందుకూరు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గడివేముల బీసీ, ఎస్సీ కాలనీలు, డొంగువీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మూలపెద్దమ్మ రస్తా మురుగుకూపాన్ని తలపిస్తుంది. గడివేములతోపాటు గ్రామీణులు ఎక్కువ మంది టైఫాయిడ్ జ్వరాలకు గురవుతున్నారు. అదేవిధంగా మరికొందరు గున్యాతోనూ బాధపడుతున్నారు. కొందరిలో డెంగీ ప్రాథమిక లక్షణాలు సైతం గుర్తించినట్లు సమాచారం. గడివేముల పీహెచ్‌సీతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులను విషజ్వరాల బాధితులు ఆశ్రయిస్తున్నారు. రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. అయితే సీజన్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలంటున్నారు డాక్టర్ మొల్లా జబీన్. ఈ వ్యాధుల వ్యాప్తి నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. సాధారణంగా మలేరియా జ్వరం 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు చెమటలు పట్టి తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి భారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలి.

డెంగీ: ఈవ్యాధి టైగర్ దోమ మూలంగా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంగా నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. డెంగీ జ్వరం 10 నుంచి 15 రోజుల వరకు ఉంటుంది. ఒక్కసారిగా జ్వరం వచ్చి తీవ్ర మైన తలనొప్పి, నొసటిపై నొప్పి ఉంటుంది. కంటి లోపల కూడా నొప్పి ఎక్కువగా ఉంటుంది.

చికెన్ గున్యా : ఈ వ్యాధి ఈడిస్ దోమ వల్ల వస్తుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలుంటాయి. ఈ వ్యాధి కూడా మామూలుగా 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. జ్వరం తగ్గిన తర్వాత 10 రోజుల పాటు ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారికి ఒళ్లు నొప్పులతో పాటు అధిక జ్వరం వస్తుంది.

మెదడు వాపు : ఈ వ్యాధి క్యూలెక్స్ దోమ మూలంగా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ మురుగు నీటిలో పెరుగుతుంది. క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాపించే అర్బో వైరస్‌తో కొంగలు, బాతులు, పందుల ద్వారా ఈవ్యాధి మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి 10 నుంచి 14 రోజుల పాటు ఉంటుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తికి జ్వరం రావడంతో పాటు మత్తుగా ఉన్నట్లు ఉంటుంది. వ్యాధిగ్రస్తులు ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్తారు. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి.

మలేరియా: ప్లాస్మోడియం జాతి సూక్ష్మక్రిముల మూలంగా ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ కుట్టిన వ్యక్తి రక్తంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయాన్ని చేరుకుని కణాల్లోకి చొచ్చుకెళ్తాయి. ఇవి సంతానాన్ని వృద్ధి చేసి మలేరియా వ్యాధిని కలిగిస్తాయి. వస్తూ పోయే జ్వరం. కడుపులో అసౌకర్యం, చలితో వణుకు, కొంత సేపటికే చెమటలు మలేరియా లక్షణాలు.

కామెర్లు: కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధి కామెర్లు. ఇది హెపటైటిస్–బి, హెపటైటీ స్–సీ వంటి ఇన్ఫెక్షన్లతో కామెర్లు వచ్చే అవకాశం ఉంది. కళ్లు, చర్మం పసుపు పచ్చగా మారడం, రక్తంలో బైలు రూబిన్ స్థాయి పెరగడం, ఆకలి మందగించడం, జ్వరం, గొంతునొప్పి, మూత్రం పచ్చగా రావడం, కడుపు నొప్పి లక్షణాలు ఉంటాయి.

డయేరియా: బ్యాక్టీరియా, వైరల్, పరాన్న జీవుల ఇన్ఫెక్షన్ మూలంగా నీళ్ల విరేచనాలు వస్తాయి. రోజుకు మూడు అంతకన్నా ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించవచ్చు. ఈ వ్యాధితో ఒంట్లో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోయి ముఖ్యమైన లవణాలు(బైకార్బొనేట్, పొటాషియం)బయటకుపోవడం ద్వారా డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది.

రోగులకు రక్త పరీక్షలు

గడివేముల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రోగులు ప్రతి రోజు 125 నుంచి 140 వరకు ఆసుపత్రికి వస్తుంటారు. డాక్టర్ మొల్లా జబీన్ పర్యవేక్షణలో విషజ్వరాలు సోకిన రోగులకు వైద్య సేవలతోపాటు చాలా మందికి రక్త పరీక్షలు చేస్తున్నారు సిబ్బంది. ప్రతి నెలా 575 మందికి మలేరియా, డెంగీ 55, వివిధ రకాల కణాల పరీక్షలు 65, ఆర్‌బీఎస్ 262, హెచ్‌బీ పరీక్షలు 136 మందికి చేసినట్లు సమాచారం.



గడివేములో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తున్న కార్మికులు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలి. జ్వరం లక్షణాలుంటే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలి. వైద్యుల సిఫార్సుల మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుంది. ఆ మేరకు మందులు వాడి, జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం ఉత్తమం.

– డాక్టర్ మొల్లా జబీన్, పీహెచ్‌సీ వైద్యురాలు, గడివేముల

కన్నమడకలో వైద్య శిబిరం

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ పీహెచ్ఎన్ రమణమ్మ సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శిలువజ్యోతి, ప్రకాశరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: పారిశుద్ధ్య పనులపై కార్మికులు ప్రత్యేక శ్రద్ధచూపాలని ఎంపీడీఓ మల్లీశ్వరి సూచించారు. మండల పరిధిలోని మీదివేముల గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీఓ సందర్శించారు. వీధులను కలియతిరిగి మురుగునీటి కాల్వులు, మంచినీటి పైపులైన్లు, మురుగుకూపాలను పరిశీలించిన ఎంపీడీఓ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: ఉపాధ్యాయులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, అప్పుడే విద్యాబోధన బాగుంటుందని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా ఆధ్వర్యంలో మండలంలోని హెచ్ఎంలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఆహార నియవాలు, జబ్బుల తీవ్రత, నివారణ అంశాలను ఉపాధ్యాయులకు తెలియజేసిన ఎంపీడీఓ విద్యార్థులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. టీచర్లు సమయపాలన పాటించేలా హెచ్ఎంలు పర్యవేక్షించాలని ఎంఈఓలు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఆరోగ్య జాగ్రత్తలపై ఫిజియోథెరపిస్ట్‌లతో డెమో ఇప్పించారు.

కలుషిత ఆహార పదార్థాలతోనే డయేరియా వ్యాప్తి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ హరిచంద్రుడు

సి.బెళగల్: కలుషితమైన ఆహార పదార్థాలు, తాగునీటితోనే డయేరియా వ్యాపిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ హరిచంద్రుడు, డాక్టర్ శ్రావణి సూచించారు. మండలంలోని పోలకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం రమతో కలిసి సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణ చర్యలపై వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచంద్రుడు డాక్టర్లు మాట్లాడుతూ ఆహార పదార్థాలు కలుషితం కాకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల పరిశుభ్రను పాటించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లు, లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేంద్రబాబు తెలిపారు. క్యాంపస్ సెక్షన్ పరిధిలోని మద్దూరు నగర్, సి.క్యాంప్, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, సాయివైభవ్ నగర్, చెక్‌పోస్టు ప్రాంతం, శేషాద్రి నగర్, బృందావన్ నగర్, మారుతీ నగర్, అరుంధతీ నగర్, పరిసర ప్రాంతాలు రెవెన్యూ కాలనీ, శ్రీరాం నగర్, మారుతీ మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మి నగర్, కమలా నగర్, టెలికాం నగర్, గఫార్ నగర్, పరాసతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ప్రాంతం, కిసాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్ కాలనీ, మాధవనగర్, బి.క్యాంప్, గాయత్రి ఎస్టేట్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదని తెలిపారు.

రోడ్లను పునఃనిర్మించాలి



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలో దెబ్బతిన్న రోడ్లను తక్షణమే పునఃనిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం నాయకులు రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో కేతవరం గ్రామ ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన కేతవరం–గార్గేయపురం రోడ్డును తక్షణమే నిర్మించాలన్నారు. ఈ రోడ్డు అధ్వానంగా మారిందని, ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ రాలేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, రంగస్వామి, వెంకటస్వామి, నాగరాజు, బుగ్గరాముడు, మధుసూదన్‌బాబు, సుబ్బరాయుడు, సిద్ధన్న, మద్దిలేటి, నరేష్, బలరాముడు, వెంకటేశ్వర్లు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



కె.నాగలాపురంలో ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కోడుమూరు రూరల్: గ్రామ,వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి బాలక్రిష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో జరుగుతున్న ఆధార్ క్యాంప్‌ను డీఎల్‌డీఓ తనిఖీ చేశారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఆధార్ క్యాంప్‌లో 0నుంచి ఐదేళ్ల చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు, 5నుంచి 17సంవత్సరాల వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్, 18సంవత్సరాలు పైబడిన వారికి అడ్రస్ మార్పులు, పుట్టినతేదీ, వివరాల మార్పులు చేస్తారన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధార్ క్యాంపులపై ప్రజలకు సమాచారం ఇవ్వాలని డీఎల్‌డీఓ ఆదేశించారు.

గురుకుల పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ అనుపమ తనిఖీ చేశారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్ బలరాముడును, ఏఓ ఈరన్నను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. హాజరు, రికార్డులను ఆమె తనిఖీచేసి వివరాలను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం డైనింగ్ హాల్‌లో భోజన వడ్డించే ప్రక్రియను, మెనూ, వంటిగది పరిశుభ్రతపై ఆరా తీశారు. భోజనం నాణ్యత, మెనూ అమలును విద్యార్థుల అడిగి తెలుసుకున్న తహసీల్దార్ భోజన నాణ్యతపై ఫిర్యాదులు ఉన్నాయని, సరిచేసుకోవాలని సూచించారు.

మద్యం సీసాలు తరలిస్తున్న మహిళ అరెస్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరులోని వెంకటగిరి రోడ్డులో అక్రమంగా 32మద్యం సీసాలు తరలిస్తున్న అనుగొండకు చెందిన ఆదిలక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు శుక్రవారం తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో నాటుసారాను విక్రయిస్తున్న క్రిష్ణవేణిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. నాటుసారాను విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని నంద్యాల సెబ్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా సమాచారం ఇవ్వాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ హామీ ఇచ్చారు.

పోలీస్ బందోబస్త్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న హిజ్రాల కార్యక్రమానికి పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. శనివారం రాత్రి సుమారు 30 మంది వరకు పోలీసులు కాలనీలో బందోబస్త్‌లో పాల్గొన్నారు. ఇటీవల రెండు గ్రూప్‌ల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే ఓ వర్గానికి చెందిన హిజ్రాలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఇంకో గ్రూప్ హిజ్రాలు వస్తారనే అనుమానంతో ముందు జాగ్రత్తగా పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

ఝార్ఖండ్ వాసి మృతి

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ సమీపంలో సోలార్ పనులు చేస్తూ ఝార్ఖండ్ వాసి మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ శనివారం తెలిపారు. గర్వజిల్లా నెరల్‌లి గ్రామానికి చెందిన జగ్గు మోహతే(37) సోలార్ పరిశ్రమలో డోజర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడన్నారు. అయితే డోజర్‌కు మరమ్మత్తులు చేసుకుంటుండగా ఒక్కసారిగా ముందుకెళ్లిందన్నారు. డోజర్ టైర్లు జగ్గు మోహేతపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్యతోపాటు కుమార్తె, కొడుకు సంతానం. కేసుమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తకాల పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల జెడ్పీహెచ్, ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక మోడల్ స్కూల్‌ను సందర్శించి, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ఎంపీడీఓ మల్లీశ్వరితో కలిసి అందజేశారు.

విద్యతో చక్కటి భవిష్యత్తు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ బాలనరసింహులు

కోడుమూరు రూరల్: ఉన్నతమైన చదువులతోనే విద్యార్థులకు చక్కటి భవిష్యత్ ఉంటుందని కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. శుక్రవారం కోడుమూరులోని కేవీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ బాలనరసింహులు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, క్రమశిక్షణతో విద్యనభ్యశించాలని సూచించారు. అనంతరం ఇంటర్‌లో ఫస్ట్ యర్‌లో అత్యధిక మార్కులు సాధించిన రవితేజ, ప్రియాంకను ఎస్ఐతో పాటు ప్రిన్సిపాల్ గోట్ల శేఖర్, కరస్పాండెంట్ రవి, బాలుర హైస్కూల్ హెచ్ఎం తైమూర్‌బాషా జ్ఞాపికలతో సత్కరించారు.

నీటి ప్రవాహం ఉధృతం.. జాగ్రత్తగా ఉండాలి



గుండ్రేవుల గ్రామం సమీపాన తుంగభద్రనది నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: తుంగభద్రనది నీటి ప్రవాహం ఉధృతంగా ఉందని, తీరం ప్రాంతాలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. మండ పరిధిలోని నదీతర గ్రామాలైన ముడుమాల, కొండాపురం, గుండ్రేవులలో ఆమె పర్యటించారు. గుండ్రవుల పుష్కరఘాట్ వద్ద నదినీటి ప్రవాహాన్ని పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రజలతో తహసీల్దార్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం హోస్పేట్ డ్యామ్ నుంచి దిగువకు లక్షనర క్యూసెక్కుల వరదనీటిని వదిలారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్ద ఎత్తున వరదనీరు వస్తుందని, తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా సర్పంచ్‌లు, అధికార యంత్రాంగం ప్రజలకు వరదనీటి ప్రవాహంపై అవగాహన కల్పించి జాగృతం చేయాలని సూచించారు. నదీతీర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న గూడూరు మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్‌కుమార్

కోడుమూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గూడూరు మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్‌కుమార్ ఆదేశించారు. గూడూరు మండల పరిధిలోని పెంచికలపాడులో శుక్రవారం మండల అధికారులతో కలిసి స్పెషల్ ఆఫీసర్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ శానిటేషన్, తాగునీటి సరఫరాలో ఏ మాత్రం నిర్లక్ష్యం తగదని సిబ్బందిన హెచ్చరించారు. ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లోరినేషన్ చేసిన తర్వాతనే తాగనీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని గూడూరు ఎంపీడీఓ విజయసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన చౌదరికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి భోజన పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లతమ్మ, ఈఓ మధులత, పంచాయతీ కార్యదర్శి ఎలిజబెత్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: మండల పరిధిలోని రెమడూరు, పుసులూరు, బొల్లవరం పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు. రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. బొల్లవరంలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసిన ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా... లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నీలం రామచంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఎంఈఓ మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కష్టమైనా ఇష్టంగా చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు.